
సాక్షి కృష్ణాజిల్లా

మంగళవారం ၊ 23 ၊ ఏప్రిల్ ၊ 2024



సర్వ రోగాలకు చికిత్స యోగా

గాంధీనగర్: విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వేసవి ప్రత్యేక యోగా తరగతులను సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 506.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,598, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



	కనిష్టం	గరిష్టం
నందిగామ	26.8	41.8
జగ్గయ్యపేట	26	43
మచిలీపట్నం	28	36
గుడివాడ	27	41

న్యూస్‌రీల్

నంది వాహనంపై దుర్గా మల్లేశ్వరస్వామి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆది దంపతులకు సోమవారం నంది వాహనంపై నగరోత్సవ సేవ నిర్వహించారు. నాలుగోరోజు ఆలయం వద్ద పలు వైదిక కార్యక్రమాలను అర్చకులు చేశారు. సాయంత్రం మహా మండపం వద్ద నంది వాహనంపై కొలువు తీరిన దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఇతర అర్చకులు పూజలు నిర్వహించగా ఆలయ ఈవో కేఎస్ రామరావు కొబ్బరికాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య ఊరేగింపు కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, శ్రీనివాస మహల్, కోమలవిలాస్, సామారంగం చౌక్, మెయిన్‌రోడ్డు, ఐరన్ సెంటర్, రథం మీదుగా తిరిగి మహా మండపానికి చేరింది. దేవస్థానానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీలో నేతలకు చోటు

విజయవాడస్పోర్ట్స్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీల్లో రాష్ట్ర ఎస్సీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా మేదర సురేష్‌కుమార్, దాసి జయప్రకాష్‌కెనడి, మేడా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా బోను దుర్గానరేష్, బెజవాడ గణేష్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎస్. ప్రవీణ్ సజ్జన్‌ప్రసాద్‌ను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్నికల విధులకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మే 13న నిర్వహించే సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొంటారని ఎన్టీఆర్ జిల్లా మీడియా కో ఆర్డినేటర్ డాక్టర్ వెలగా జోషి అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎన్నికల విధులకు హాజరుకావాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎలక్షన్ డ్యూటీలకు హాజరవుతారని చెప్పారు. సీఐలు కాశీ విశ్వనాథ్, సహేరా బేగం, జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు పాల్గొని మాట్లాడారు.

డబ్బు అహంకారంతో ఓటర్లను వెధవలంటారా?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి

జి.కొండూరు: డబ్బు అహంకారంతో టీడీపీకి ఓటు వేయని ఓటర్లను వెధవలంటూ ఎన్ఆర్ఐ టీడీపీ సీనియర్ నాయకుడు కోమటి జయరామ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మైలవరం నియోజకవర్గ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఎన్ఆర్ఐ టీడీపీ మీట్‌లో మైలవరం మండల పరిధి వెల్వడంకు చెందిన కోమటి జయరామ్ ఓటర్లను కించపరుస్తూ మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీకి ఓటు వేయని వెధవలకు డబ్బు ఇచ్చి లొంగదీసుకోవాలని జయరామ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ పార్టీలను రెచ్చగొట్టేలా ఉన్నాయన్నారు. అంతే కాకుండా ఒక్కొక్క ఎన్ఆర్ఐ సభ్యుడు కొన్ని లక్షల వరకు ఖర్చు పెట్టి అయినా ప్రతి నియోజకవర్గంలో వేయి ఓట్లు టీడీపీకి వేయించాలని పిలుపునివ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. జయరామ్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎంతమంది కలిసి గుంపులుగా వచ్చినా, ఎన్ని కోట్ల డబ్బుతో వచ్చినా ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. మైలవరం నియోజకవర్గంతో పాటు రాష్ట్ర మంతా మరోసారి వైఎస్సార్ సీపీ జెండానే ఎగురుతుందన్నారు.

అదరగొట్టారు!

'పది' ఫలితాల్లో సత్తా చాటిన 'కృష్ణా' విద్యార్థులు

- 90.05శాతం ఉత్తీర్ణత
- గత ఏడాది 74.67 శాతం మాత్రమే
- రాష్ట్రంలో జిల్లాకు 11వ స్థానం
- మొత్తం 94 పాఠశాలల్లో నూరుశాతం ఫలితాలు
- 575కు పైగా మార్కులు సాధించిన 31 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



కలెక్టర్ డీకే బాలాజీని సత్కరిస్తున్న డీఈవో తాహెరాసుల్తానా, విద్యాశాఖాధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అదరగొట్టారు. గతేడాదితో పోల్చితే చాలా మెరుగైన ఫలితాలు సాధించారు. 2023 ఉత్తీర్ణత శాతం 74.67 కాగా ప్రస్తుతం 90.05 శాతంతో సత్తా చాటారు. రాష్ట్రంలో కృష్ణా జిల్లాను 11వ స్థానంలో నిలబెట్టారు. సోమవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విడుదల చేసిన పదో తరగతి ఫలితాల బట్టి చూస్తే జిల్లాలో మొత్తం 21,112 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 19,011 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 9,833 మంది బాలురు, 9,178 మంది బాలికలు ఉన్నారు. విద్యాశాఖాధికారులు ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ప్రత్యేక శ్రద్ధ చూపి ఆ దిశగా చర్యలు చేపట్టారు. దీంతో గత సంవత్సరం కంటే 15.38 శాతం ఉత్తీర్ణత పెరిగింది.

లక్ష్యం కోసం..

జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో గతంలో కంటే మెరుగ్గా ఉండాలని విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముందు పదో తరగతి విద్యార్థులు నూరుశాతం పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాల సమయం కాకుండా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేపట్టారు. దీంతో పాటు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన స్ఫూర్తి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేసి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకున్నారు. తక్కువ మార్కులు, సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు దత్తత తీసుకుని విద్యాబోధన చేసి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మార్కులు ఆధారంగా మరింత ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు చేపట్టారు.



కనుపర్తి భావజ్ఞ సాయి(597)

- చల్లపల్లి మండలంలోని పాగోలులో ఉన్న ఎన్టీఆర్ ట్రస్ట్ పాఠశాల ఎన్టీఆర్ హైస్కూల్ బాలిక కనుపర్తి భావజ్ఞ సాయి 597/600 మార్కులతో స్టేట్ టాపర్లలో ఒకరిగా నిలిచింది.

ప్రభుత్వ పాఠశాలల సత్తా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సర్కారు బడుల్లో చేపట్టిన సంస్కరణల ఫలాలు పదో తరగతి ఫలితాల్లో సుస్పష్టంగా కనిపించాయి. పాఠశాలల్లో కల్పించిన సౌకర్యాలు, అత్యాధునిక బోధన విధానాలు విద్యార్థులకు బాగా ఉపయోగపడ్డాయి. జిల్లాలోని జిల్లా పరిషత్, మునిసిపల్ హైస్కూళ్లతో పాటు ఇతర ఎయిడెడ్ పాఠశాలల్లో ఎక్కువ మంది నూరుశాతం ఉత్తీర్ణులయ్యారు. అలాగే 575 మార్కులు పైబడి ప్రభుత్వ పాఠశాలల్లో 31 మంది విద్యార్థులకు రావటం విశేషం. జిల్లాలో 94 ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించినందుకు కలెక్టర్ డీకే బాలాజీని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానా, ఇతర విద్యాశాఖాధికారులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.

మెరుగైన ఫలితాలు సాధించాం..

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గతంలో కంటే ఈ ఏడాది ప్రత్యేక దృష్టి పెట్టి మెరుగైన ఫలితాలు సాధించగలిగాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాం. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు నిరుత్సాహపడకుండా ఈ నెల 23 నుంచి 30వ తేదీలోగా రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాం. అలాగే మే 24 నుంచి జూన్3 వరకూ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తాం.

– తాహెరాసుల్తానా, జిల్లా విద్యాశాఖాధికారి

కార్పెంటర్ కుమార్తె జిల్లా టాపర్

గుడివాడ టౌన్: పదో తరగతి పరీక్షల్లో గుడివాడకు చెందిన అల్లంపల్లి భాను ప్రసన్న ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా టాపర్‌గా నిలిచింది. స్థానిక ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు(ఏకేటీపీ) మున్సిపల్ బాలికల హైస్కూల్లో చదివిన విద్యార్థిని 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి సత్తా చాటింది. పేదరికంలో జన్మించిన భాను ప్రసన్న జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భానుప్రసన్న తండ్రి రాంబాబు కార్పెంటర్‌గా పనిచేస్తుంటారు. తల్లి గృహిణి. అన్న నాగఫణీంద్ర 10వ తరగతి పాసై పాలిటెక్నిక్ పూర్తిచేశారు. అనంతరం ఈసెట్ పరీక్షల్లో 3 వేలు ర్యాంకు సాధించి స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న ఈ కుటుంబంలో ఒక ఆణిముత్యం వెలికిరావడం పట్టుదల, దీక్షకు నిదర్శనం అని ఉపాధ్యాయులు అంటున్నారు.

నాలాంటి వారికి చేయూతనిస్తా..

ఇంతటి విజయాన్ని సాధించిన భాను ప్రసన్నతో 'సాక్షి' మాట్లాడగా తాను ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థితికి చేరుకుని తద్వారా నాలా చదువుకుంటున్న పేద విద్యార్థులకు, సమాజంలో ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి చేయూతగా నిలవాలన్నది తన జీవిత లక్ష్యం అంటున్నారు. భానుప్రసన్నను డీఈఓ తాహెరా సుల్తానా, డీవైఈఓ ఐ. పద్మరాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమా మహేశ్వరరావు, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ షేక్ జాని సాహెబ్, ఉపాధ్యాయులు అభినందించారు.



భానుప్రసన్న, తల్లిదండ్రులను అభినందిస్తున్న హెచ్ఎం ఉమామహేశ్వరరావు

వైభవంగా ఆది దంపతుల కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధర్మపథం వేదికపై ఆది దంపతుల కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈవో కేఎస్ రామరావు దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఏఈవో చంద్రశేఖర్, ఎస్. రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

365 రోజులు అఖండ పారాయణం

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుంటూరు జిల్లా పెనుమాకలోని శ్రీ వైష్ణవ మహా దివ్య క్షేత్రం ప్రాంగణంలో మంగళవారం నుంచి ఏడాది పాటు (365 రోజులు) అఖండ శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ క్షేత్రం కార్యదర్శి దూపుగుంట్ల శ్రీనివాసరావు తెలిపారు. లోక కల్యాణార్థం నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. విజయవాడ ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాజేటి వెంకట దుర్గాప్రసాద్, దూపుగుంట్ల శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ నెల 23 చైత్ర మాస పౌర్ణమి నుంచి 365 రోజుల పాటు తమ దివ్యక్షేత్ర ప్రాంగణంలో శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. మందిర నిర్వహణ కమిటీ చైర్మన్ తాడికొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హోరు.. నామినేషన్ల జోరు

- కృష్ణా జిల్లాలో ఒక్కరోజే 31 నామినేషన్లు దాఖలు
- వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ చంద్రశేఖరరావు నామినేషన్
- కార్యకర్తతో భారీ ర్యాలీగా వెళ్లి ఆర్ఓకు పత్రాల అందజేత
- నామినేషన్ దాఖలు చేసిన గుడివాడ, మచిలీపట్నం, పామర్రు అసెంబ్లీ అభ్యర్థులు



నామినేషన్ దాఖలు చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు

సాక్షి, మచిలీపట్నం/చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక సమరానికి గడువు సమీపిస్తున్న కొద్దీ జిల్లాలో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. అభ్యర్థులు ఒకవైపు ముమ్మర ప్రచారం చేస్తూ.. పెద్ద ఎత్తున నామినేషన్లు సమర్పిస్తున్నారు. సోమవారం మంచి ముహూర్తం ఉండటంతో అన్ని ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్ర అభ్యర్థులు కూడా తమ నామినేషన్‌లను దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుతో పాటు గుడివాడ, మచిలీటపట్నం, పామర్రు అసెంబ్లీ స్థానాలకు కొడాలి నాని, పేర్ని కృష్ణమూర్తి, కైలే అనిల్‌కుమార్ నామినేషన్లు సమర్పించారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచే అభ్యర్థుల ఇళ్ల వద్ద కోలాహలం మొదలైంది.

బందరులో కోలాహలం..

మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ చంద్రశేఖరరావు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తండ్రి సింహాద్రి సత్యనారాయణ మాజీ మంత్రిగా సేవలు అందించారు. చక్కటి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్‌గా చంద్రశేఖరరావుకు జిల్లాలో మంచి పేరుంది. పార్టీ కార్యకర్తలు, నాయకులతో ర్యాలీగా వచ్చి కలెక్టరేట్‌లోని ఆర్ఓ, కలెక్టర్ డీకే బాలాజీకి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యేలు పేర్ని నాని, సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్‌కుమార్, పెడన అభ్యర్థి ఉప్పాల రాము మద్దతుగా వచ్చారు. అనంతరం డాక్టర్ చంద్రశేఖరరావు మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కుల మతాలకు అతీతంగా పథకాలు వర్తింపజేయడంతో పారదర్శకత నెలకొందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు వైఎస్సార్ సీపీకే భారీ మెజారిటీతో గెలిపిస్తారని చెప్పారు.

పెరిగిన జోష్..

ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వేగం పెంచింది. జిల్లాలో సీఎం జగన్ నిర్వహించిన బస్సు యాత్ర తర్వాత పార్టీ అభ్యర్థులు కార్యకర్తలు, నాయకులతో ప్రచారంలో తమదైన శైలిలో దూసుకుపోతున్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. మళ్లీ సీఎం వైఎస్ జగనే ప్రభంజనం సృష్టిస్తారనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

వీరు కూడా..

మంచి ముహూర్తం కావడంతో గుడివాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొడాలి నాని, మచిలీపట్నం అభ్యర్థిగా పేర్ని కృష్ణమూర్తి, పామర్రు అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేయగా అక్కడి నుంచే కైలే అనిల్ కుమార్ తల్లి కైలే జ్ఞానమణి కూడా నామినేషన్ సమర్పించారు. అయితే పేర్ని కిట్టు 23న, కైలే అనిల్‌కుమార్ 24న, కొడాలి 25న కార్యకర్తలతో భారీ ర్యాలీగా వెళ్లి మరో సెట్‌ను సమర్పించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

చంద్రశేఖరరావు ఆస్తుల విలువ రూ.51.74 కోట్లు

అవనిగడ్డ: మచిలీపట్నం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేసిన డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు మొత్తం ఆస్తుల విలువ రూ.51.74కోట్లుగా అఫిడవిట్‌లో చూపించారు. ఆయన వ్యక్తిగత ఆస్తి విలువ రూ.32,20,86,384 ఉండగా, భార్య ఎస్. నిర్మల పేరు మీద రూ.4,19,62,200 కోట్లు, కుమారుడు ఎస్. రామ్‌చరణ్ పేరు మీద రూ.15,74,37,284 ఉన్నట్టు చూపించారు.



ఆర్ఓ బాలాజీకి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ రావు



రిటర్నింగ్ అధికారి పద్మావతికి నామినేషన్ నామినేషన్ సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ గుడివాడ ఎమ్మెల్యే అభ్యర్థి కొడాలి నాని

వచ్చిన నామినేషన్లు ఇవే..

మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా గూడవల్లి వెంకటకేదారేశ్వరరావు ఒక సెట్, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా దేవరపల్లి దేవమణి ఒక సెట్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి డీకే బాలాజీకి అందజేశారు.

- మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా సొదాడ బాలాజీ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా చింతపల్లి మనోహర్ ఒక సెట్, భారతచైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా కోన నాగార్జున ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎం. వాణికి అందజేశారు.
- పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్వతంత్ర అభ్యర్థులుగా పచ్చిపాల కనకదుర్గారావు ఒక సెట్, గోగం రాము ఒక సెట్, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా సోము మహేశ్వరరావు ఒక సెట్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి దాసి రాజుకు అందజేశారు.
- పామర్రు అసెంబ్లీ నియోజకవర్గానికి బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా రాయవరపు బాబూ రాజేంద్రప్రసాద్ ఒక సెట్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి శ్రీదేవికి అందజేశారు.
- గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జై భీమ్‌రావు పార్టీ అభ్యర్థిగా కలపర్తి భాస్కరరావు ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా కొర్రపోలు శ్రీనివాసరావు ఒక సెట్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి గీతాంజలిశర్మకు అందజేశారు.
- అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జనసేన పార్టీ అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ రెండు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి బాలసుబ్రహ్మణ్యంకు అందజేశారు.
- గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా నల్లగంచు వెంకటరాంబాబు ఒక సెట్ నామినేషన్, స్వతంత్ర అభ్యర్థి రేమల్లి నీలకాంత్ ఒక సెట్, టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రాము ఒక సెట్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా అల్లూరి హేమంత్‌కుమార్ ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి పి. పద్మావతికి అందజేశారు.
- పెడన అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్వతంత్ర అభ్యర్థులుగా రాజులపాటి జమదగ్ని ఒక సెట్, సేనాపతి గోపీ ఒక సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా శొంఠి నాగరాజు ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి పి. వెంకటరమణకు అందజేశారు. టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్ ఒక సెట్, కాగిత శిరీష మరో సెట్, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా ఈడే కాశీవిశ్వేశ్వరరావు ఒక సెట్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

గన్నవరంలో యార్లగడ్డకు షాక్

బీజేపీ రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కొర్రపోలు శ్రీనివాసరావు




బీజేపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ సమర్పిస్తున్న కొర్రపోలు శ్రీనివాసరావు

గన్నవరం: నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీ నాయకుడు కొర్రపోలు శ్రీనివాసరావు రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ మేరకు సోమవారం బీజేపీ నేతలతో కలిసి ఆయన తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ గీతాంజలిశర్మకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కొర్రపోలు మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు బీజేపీలో ఒకరిద్దరు తప్ప మిగిలిన నేతలను కలుపుకోకుండా ఒంటెద్దు పోకడలకు పోతున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో బీజేపీకి రెండు వేలు ఓట్లు కూడా లేవని యార్లగడ్డ తమ పార్టీని కించపరుస్తూ మాట్లాడటం బాధాకరమన్నారు. అసలు ఎన్నికలు జరగకుండానే ఎమ్మెల్యే అయిపోయినట్లుగా యార్లగడ్డ భ్రమల్లో బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. యార్లగడ్డ తన చుట్టూ అవినీతి పరులను పెట్టుకుని అవినీతిని అంతమొందిస్తానని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదృష్టం బాగుండి అనపర్తి బీజేపీ అభ్యర్థికి పార్టీ బీ-ఫామ్ వచ్చినట్లుగా తనకు కూడా రెండుమూడు రోజుల్లో వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీజేపీ ముఖ్యనేత తనకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. పార్టీ బీ-ఫామ్ ఇవ్వకపోయినా రెబల్‌గా పోటీచేసి అత్యధిక ఓట్లు సాధించి నియోజకవర్గంలో బీజేపీ సత్తా ఏమిటో యార్లగడ్డకు తెలియజేస్తామని స్పష్టం చేశారు.

కంట్రోల్ రూంలో ఎన్నికల ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు

విజయవాడస్పోర్ట్స్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విజయవాడ పోలీస్ కంట్రోల్ రూంలో రాష్ట్ర వ్యాప్త సెంట్రల్ ఎలక్షన్స్ కంప్లైంట్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ టి.కె. రాణా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు స్పందించదగిన ఫిర్యాదులను సేకరించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగినా, నగదు, మద్యం అక్రమ రవాణాలకు పాల్పడుతున్నట్లు గుర్తించినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1800-425-5049ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు.



క్లుప్తంగా

నెట్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ జట్టు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల నెట్ బాల్ ఉమెన్ టోర్నమెంట్‌లో ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అత్యుత్తమ ప్రదర్శనతో ముగ్గురు క్రీడాకారులు ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, వ్యాయామ అధ్యాపకులు మండవ కోటేశ్వరరావు, డి.యుగంధర్ క్రీడాకారులను సత్కరించారు. ఆలిండియా పోటీల్లో సత్తాచాటి కళాశాల పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కవితల పోటీలకు ఆహ్వానం

విజయవాడ కల్చరల్: తమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కవితల పోటీ నిర్వహిస్తున్నామని జాతీయ కవితా వేదిక నిర్వాహకులు జింకా చక్రధర్, రామ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నివసించే కవులు, రచయితలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. 'ఓటు మన విధి - మన అధికారం' అంశంగా పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ నెల 30వ తేదీ లోపు కవితలను పంపించాలని సూచించారు. ఎంపికైన కవితలను మే ఐదో తేదీన వర్చువల్‌గా జరిగే సమావేశంలో స్వయంగా చదవాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 92464 71593, 984 80 35573 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాలికను లైంగికంగా వేధించిన యువకుడిపై కేసు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తూ, అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.అర్జమ్మ కథనం మేరకు.. బాపులపాడు మండలం కొత్తపల్లికి చెందిన యువకుడు రామిశెట్టి బాలు అదే గ్రామానికి 17 బాలికను కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. అంతేకాక పెళ్లి చేసుకోవాలని వెంటపడుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. భయపడిన బాలిక అతడి వ్యవహారాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు హనుమాన్‌జంక్షన్ పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లిదండ్రులను కూడా చంపుతానని రామిశెట్టి బాలు బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.అర్జమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్ సీపీలోకి 35 టీడీపీ కుటుంబాల చేరిక



పేటలోని దుర్గాపురం, ధనంబోడు కాలనీ నుంచి పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవుతారని, సంక్షేమ పాలన వస్తుందన్న ఆశతో పలువురు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. సోమవారం రాత్రి పట్టణంలోని దుర్గాపురం, ధనంబోడు కాలనీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి ఉదయభాను సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. షేక్ ఫక్రుద్దీన్, షేక్ ఇబ్రహీం, షేక్ తాజుద్దీన్, షేక్ బాషా, షేక్ అల్లావుద్దీన్, షేక్ రఫీ, షేక్ నాగుల్, షేక్ షాదర్, షేక్ యూనస్, షేక్ ఆలీ, షేక్ షోయబ్, కె.శ్రీకాంత్, కె.మరివాజు, ప్రసాద్, కృష్ణ, గోపి, షేక్ జానీ, సురేష్, ఎం.అనిల్, కె.ప్రసన్న, కె.గోపిరెడ్డి, సీహెచ్.సాయిగోపి, జి.నితిన్ తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. చంద్రబాబు హయాంలో ఇన్ని సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

తొర్రగుంటపాలెం నుంచి 5 కుటుంబాలు..

పట్టణంలోని తొర్రగుంటపాలెంనకు చెందిన మార్కపూడి ప్రసన్న, బలవంతపు రాజు, బలవంతపు స్వప్న, షేక్ కబీర్, గౌరవరం గ్రామానికి చెందిన ఆదూరి గోపి టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీ యువనేత సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రొయ్యూరులో టీడీపీకి షాక్

తోట్లవల్లూరు: మండలంలోని రొయ్యూరు గ్రామంలో టీడీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 30 మంది కార్యకర్తలు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సమక్షంలో సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీకి చెందిన వీరంకి బాలకృష్ణ, లుక్కా హర్షవర్ధన్, లుక్కా పృథ్వీ, పామర్తి అంకస్వామి, లుక్కా వెంకటస్వామి, వనమాల రామకృష్ణ తదితరులకు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్, జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి మోర్ల పూర్ణప్రసాద్, గ్రామ కన్వీనర్‌లు లుక్కా భరత్‌గౌడ్, మాత్రపు నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు లుక్కా విజయ్ తదితరులు పాల్గొన్నారు.



బండారు దుర్గారావుతో పాటు పలువురికి పార్టీ జెండా కప్పి ఆహ్వానిస్తున్న ఉప్పాల రమేష్(రాము)



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

వైఎస్సార్ సీపీలో చేరిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు

పెడన: గూడూరు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు, మల్లవోలు-2 ఎంపీటీసీ మాజీ సభ్యుడు బండారు దుర్గారావుతో పాటు యువత పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. పెడనలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) సోమవారం టీడీపీ నుంచి వచ్చిన దుర్గారావుతో పాటు యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ పాలన చాలా బాగుందని, ప్రతి పేదవాడికి న్యాయం జరిగిందని గుర్తించి వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, బూరగడ్డ శ్రీకుమార్, మండల కన్వీనర్ పర్ణం పెదబాబు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, మోటేపల్లి రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వ రోగాలకు ఖర్చులేని చికిత్స యోగా



యోగా సాధనచేస్తున్న ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యోగా సర్వ రోగాలకు ఖర్చులేని చికిత్స అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి ప్రత్యేక యోగా తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుంచే యోగాకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఆరోగ్యకర జీవితానికి, శరీరం మనసు మధ్య సమతుల్యానికి యోగా దోహద పడుతుందన్నారు. మన దేశం ప్రపంచ మానవాళికి ఇచ్చిన గొప్ప కానుక యోగ అని వివరించారు. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యల పరిష్కారానికి సులభ మార్గం యోగా అని సూచించారు. ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యోగా ద్వారా హైపర్ టెన్షన్, థైరాయిడ్, మధుమేహం వంటి వ్యాధులను అరికట్టొచ్చని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను యోగా సాధన చేసేలా కృషి చేయాలని కోరారు. అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 2017 నుంచి తమ అసోసియేషన్ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఏటా రెండు వేల మందికి పైగా ఉచితంగా యోగా శిక్షణ ఇస్తోందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు, మెడల్స్, యోగా దుస్తులను విద్యార్థులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం యోగా గురువు అంకాల సత్యానారాయణ పర్యవేక్షణలో విద్యార్థులతో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు యోగా చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ టి.హరికృష్ణ, సీఐ కాశీవిశ్వనాథ్, అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ కోశాధికారి ఎ.లావణ్య కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ప్రశాంత్ కుమార్, కార్యవర్గ సభ్యులు కె.బాజి, ఎ.ప్రసాద్, ఎస్.వి.ఆర్. నాయుడు, లీల, శ్రీనివాసరావు, సిరాజ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం



నందిగామ: జాతీయ రహదారిపై ఓ ద్విచక్రవాహనానికి మంటలు అంటుకున్న ఘటన సోమవారం రాత్రి నందిగామలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హనీష్ కథనం మేరకు.. చందర్లపాడుకు చెందిన గోపి అనే యువకుడు తన వాహనంపై జాతీయ రహదారి గుండా ఇంటికి వెళ్తుండగా, నందిగామ పట్టణంలోని రైతుపేట సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం ఆగిపోయింది. తిరిగి వాహనాన్ని స్టార్ట్ చేస్తున్న క్రమంలో ద్విచక్రవాహనం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కొద్ది సేపట్లోనే వాహనం దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ శ్రీనివాస టెక్నికల్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter. నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

REAL ESTATE

PLOT FOR SALE

■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ., బందరురోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ గజం॥ 1,900/- నుండి 18,500/- సంప్ర. ✆ 97033 13505

SERVICES

BUSINESS OFFER

■ దుస్తులపై 30% to 50% డిస్కౌంట్ షర్ట్స్, ప్యాంట్స్, నైటీస్, షార్ట్స్‌ని ESSARDI COMPANY తరుపున తయారు చేసి డిస్కౌంట్‌తో మరియు ఆర్డర్‌పై మీరు కోరిన దుస్తులను జాబ్ వర్క్ చేసి అందించగలము. రెడిమేడ్ షాపులు వారు సద్వినియోగం చేసుకోగలరు. ✆ 79978 89555

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

PEST CONTROL

■ వాసనలేని మరకలు పడని ISI కెమికల్స్ 5 సం॥ వ్యారంటీతో చెదలు (బొద్దింకలు, నల్లులు, బల్లులు) నివారించే సంస్థ, హిందుస్థాన్ పెస్ట్ కంట్రోల్. సంప్ర. : Ph: 7981533849, 9490179238

WANTED

■ గుడివాడలో 12 గంటలు డ్యూటీ చేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ 45 సంవత్సరముల లోపు వారు కావలెను. సంప్ర॥ ✆ 98667 93288

■ శ్రీరాంచిట్స్, లైఫ్ ఇన్సూరెన్స్ నందు రికవరీ, మార్కెటింగ్, ఆఫీస్ ఇన్‌ఛార్జిగా అన్ని మండలాలలో పనిచేయుటకు యువకులు కావలెను. Q. డిగ్రీ/MBA Age 30లోపు ✆ 98668 92383, 63007 02488

■ రియల్ ఎస్టేట్ ఆఫీసులో పనిచేయుటకు ఆఫీస్ సర్వెంట్ (ఆడవారు), టెలీ కాలర్స్, మార్కెటింగ్ లీడర్స్ (శాలరీ+కమీషన్) కావలెను. ✆ 98494 58515, 92905 79585

■ వర్క్‌ఫ్రమ్ హోమ్. 70 వేకెన్సీస్. PT/FT అవకాశం. 10K to 20K సంపాదించే అవకాశం, స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. ✆ Vineela : 95422 82963, Rani : 96525 62633

■ ప్రముఖ సెక్యూరిటీ కంపెనీ నందు సెక్యూరిటీ గార్డ్ కావలెను. జీతం 16000 to 18000 సంప్రదించండి 76759 31411, 85209 87644

■ డైరెక్ట్ జాయినింగ్: పాల డెయిరీ, ఫ్యాక్టరీ, స్టీల్, ఫార్మా, ట్రాన్స్‌పోర్టర్ కం.లలో సూపర్‌వైజర్స్, స్టోర్ ఇన్‌చార్జి, డ్రైవర్స్, ITI, Dip All, Ex-army కావలెను. PF, ESI. (రూం+బో) జీ: 18-36 వేలు ✆ 93811 38469

■ నూజివీడు వద్ద పల్లెగుడిపాడు స్పిన్నింగ్ మిల్లులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్సు కావలెను. 8h. డ్యూటీ, మంచి జీతం, PF, ESI లు కలవు. Q : 10th వ : 22-45 Y. సంప్ర : ✆ 63005 21289

■ Require experienced Sales Executives and Telecalers at Royal Enfield Showroom located at Machavaram, Vijayawada. ✆ 95423 82368, 75695 63008

■ శ్రీరామ్‌చిట్స్ ఉయ్యూరు బ్రాంచి నందు పని చేయుటకు రికవరీ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత : డిగ్రీ, వ : 30 సం॥ లోపు జీతం: 18,000/- + ఇన్సెంటివ్స్, PF + ESI సౌకర్యం కలదు. సంప్ర ✆ 99490 48471

■ ఫిమేల్ హాస్టల్ ఇన్‌చార్జీలు కావలెను. జీతము 10 వేలు-12 వేలు వరకు ఇవ్వబడును. భోజనం మరియు వసతి ఇవ్వబడును. మాస్టర్ మైండ్స్, 3/11, బ్రాడీపేట, గుంటూరు. 91000 24059

■ విజయవాడ కానూరులోని ప్రముఖ ఆఫీసు నందు పనిచేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. అనుభవం వున్నవారికి ప్రాధాన్యత. సంప్ర॥ 93814 69087

■ కర్ణాటక్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40,000, ఫ్రీ రూమ్+భోజనం, Hyd. Ph: 9014885406

■ ప్రముఖ ఎయిర్‌పోర్టులో పనిచేయుటకు లోడింగ్ సూ॥ వైజర్స్, హౌస్‌కీపింగ్ సూ॥వైజర్స్, డ్రైవర్స్, కార్గో లోడర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీతం: 25000/- 35000/-, రూమ్+భోజనం ఫ్రీ. ఫోన్: 9642261084

■ మీషో కంపెనీలో టెలికాలర్స్‌గా చేయుటకు పార్ట్ టైమ్/ఫుల్ టైమ్, మేల్/ఫిమేల్ కావలెను. Qly: 10th, జీతం : 16,000 to 18,000 సంప్ర: Ph: 8008860389, 7416297427

సాక్షి క్లాసిఫైడ్స్
మచిలీపట్నం, పెడన 9912220543
అవనిగడ్డ, చల్లపల్లి 9912220546 7995566983
గుడివాడ 7995092115
పామర్రు 9010577706
కైకలూరు 9951602985
నందిగామ 7995092114
జగ్గయ్యపేట 9912220547
మైలవరం, ఇబ్రహీంపట్నం 9010223734
తిరువూరు 9951020399
నూజివీడు 9912220544
ఎన్టీఆర్ జిల్లా + కృష్ణాజిల్లా రూ.600/- రూ.150/- + 5% GST

బైక్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు



ఘటనాస్థలంలో ఆదిలక్ష్మి మృతదేహం, పక్కన రక్తమోడుతున్న సురేష్



ఘటనాస్థలం

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- చనిపోయిన వ్యక్తిని చూసేందుకు వెళ్తుండగా ప్రమాదం

పెనుగంచిప్రోలు: ద్విచక్ర వాహనాన్ని ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామానికి చెందిన వనపర్తి సురేష్, అంజమ్మ దంపతులు. వత్సవాయి మండలం మంగొల్లు గ్రామంలో నివసించే తన మామ మృతి చెందాడని తెలియడంతో సురేష్ సోమవారం ఉదయం భార్యతో పాటు తల్లి ఆదిలక్ష్మి, ఐదేళ్ల కుమార్తె లాస్యతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆ గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో నవాబుపేట గ్రామంలో శివాలయం పక్క నుంచి రహదారిపైకి వస్తున్న శ్రీ చైతన్య స్కూల్ బస్సు ఎదురుగా వస్తున్న వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్నవారు ఎగిరి రోడ్డుపై పడ్డారు. తలకు తీవ్ర గాయమైన ఆదిలక్ష్మి(65) ఘటనా స్థలంలోనే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన సురేష్, అంజమ్మ, లాస్యను 108 వాహనంలో తొలుత నందిగామ ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సురేష్(40) మృతి చెందాడు. అంజమ్మ, లాస్య చికిత్స పొందుతున్నారు. లాస్య పరిస్థితి విషమంగా ఉంది. సురేష్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు.

చాగంటి ప్రవచనం వాయిదా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో 24, 25వ తేదీల్లో నిర్వహించాల్సిన చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం అనివార్య కారణాలతో వాయిదా పడిందని ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు సోమవారం తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించతలపెట్టిన కార్యక్రమం వాయిదా పడిందని పేర్కొన్నారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించే తేదీని ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

యార్డుకు 95,448 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 95,448 మిర్చి బస్తాలు రాగా, నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 93,891 బస్తాలు విక్రయించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల క్వింటా సగటు ధర రూ.8 వేల నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాలకు సగటు ధర రూ.8 వేల నుంచి రూ.20 వేల వరకు లభించింది. తాలు రకం మిర్చి ధర రూ.5 వేల నుంచి రూ.11 వేల వరకు పలికింది. విక్రయాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 60,589 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

పుట్టింది బందరులో.. పెరిగింది అవనిగడ్డలో..

- నేను స్థానికుడిని కాబట్టే రాజకీయాల్లోకి వచ్చా
- విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం
- వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు
- డాక్టర్ చంద్రశేఖరరావు అభ్యర్థిత్వం జిల్లా ప్రజల అదృష్టం : పేర్ని నాని



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు. చిత్రంలో పేర్ని నాని, సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్, ఉప్పాల రాము

మచిలీపట్నంటౌన్: 'నేను స్థానికుడిని. బందరులో పుట్టాను. అవనిగడ్డలో పెరిగాను. ప్రజా సేవ చేయాలనే రాజకీయాల్లోకి వచ్చాను' అని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం నామినేషన్ పత్రాన్ని దాఖలు చేసిన అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. క్యాన్సర్ వైద్యుడినైన తాను స్థానికుడిని కాబట్టే ప్రజాసేవకుడిగా పనిచేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా బడుగు, బలహీనవర్గాల వారికి, అగ్రవర్ణాల పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని క్షేత్రస్థాయి పర్యటనలో తనకు తెలిసిందన్నారు. మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు పోటీ చేయడం జిల్లావాసుల అదృష్టమన్నారు. ఆయన 35 ఏళ్లుగా క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్‌గా వైద్యసేవలు అందించి ఎంతో మంది మన్ననలు పొందారన్నారు. క్యాన్సర్ స్పెషలిస్ట్‌గా విశేష అనుభవం కలిగిన ఆయన ప్రజాసేవకుడిగా ప్రజల్లోకి రావటం మంచి పరిణామమని అన్నారు. డాక్టర్ చంద్రశేఖరరావు ఎన్నికల ప్రచారంలో నిత్యం పదుల సంఖ్యలో పేషెంట్లు తమ ఆస్పత్రి ఫైల్స్‌తో వచ్చి వైద్యసహాయం కోరుతున్నారని తెలిపారు. ఆయన చేతనైన సాయం చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్‌పై స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం పరుగులు తీయాలంటే ప్రజలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో అవనిగడ్డ, పామర్రు, పెడన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్‌కుమార్, ఉప్పాల రాము పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో వెళ్లి నామినేషన్ వేసిన వసంత



సెక్యూరిటీ జోన్‌లో సిబ్బందిని తోసుకుని బైకుపై వెళ్తున్న వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: తెలుగుదేశం మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్ రూట్ మ్యాప్‌నకు భిన్నంగా రాంగ్‌రూట్‌లో వెళ్లి నామినేషన్ వేశారు. స్వచ్ఛందంగా తరలివచ్చిన వేలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు ఇటీవల నామినేషన్ దాఖలు చేశారు. దీంతో తానూ బల ప్రదర్శనగా వెళ్లి నామినేషన్ వేయాలని వసంత కృష్ణప్రసాద్ భావించారు. పార్టీ శ్రేణులకు రకరకాల తాయిలాలు ప్రకటించి ఆహ్వానించారు. అయితే పార్టీ శ్రేణుల కన్నా వాహనాలే ర్యాలీలో అధికంగా ఉన్నాయి. వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి మైలవరం పట్టణంలోకి కూడా ర్యాలీ చేరుకోని పరిస్థితి నెలకొంది. దీంతో రూట్ మ్యాప్‌లో లేని బైపాస్‌రోడ్డు మీదుగా వసంత బైకుపై వెళ్లి నామినేషన్ వేశారు. రూట్‌మ్యాప్‌లో బైపాస్‌పై వెళ్లేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో వారితో వాగ్వాదానికి దిగి తోసుకొని వెళ్లారు. పార్టీ విజయం కోసం కలిసి పనిచేస్తామంటూ వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో ఆదివారం చేయి కలిపిన దేవినేని ఉమామహేశ్వరరావు నామినేషన్ కార్యక్రమానికి హాజరవకుండా ర్యాలీ మధ్యలోనే వెళ్లిపోవడం గమనార్హం. వసంత వెంకటకృష్ణప్రసాద్ అభ్యర్థిత్వాన్ని దేవినేని ఉమా పరోక్షంగా తిరస్కరించినట్లు ఈ ఘటనతో తేటతెల్లమైందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

దాడులను మరింత ముమ్మరం చేయండి

సెబ్ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సెబ్ ఏఎస్పీ వెంకటేశ్వరరావు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మద్యం, సారా అక్రమ రవాణాపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ శాఖలు దాడులను మరింత ముమ్మరం చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు ఆదేశించారు. జిల్లాలోని సెబ్, ఎక్సైజ్ అధికారులు, సిబ్బందితో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో లిక్కర్, సారా యథేచ్ఛగా రవాణా జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాలని సూచించారు. దాడుల్లో పట్టుబడిన వ్యక్తులపై అప్పటికప్పుడు కేసులు నమోదు చేసి, దొరికిన వాహనాలు, ఇతర సామగ్రిని సీజ్ చేయాలని ఆదేశించారు. సెబ్ ఆధ్వర్యంలో జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన దాడుల్లో 250 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ కేసులకు సంబంధించి 248 మందిని అరెస్ట్ చేశామన్నారు. 285 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవటంతో పాటు 4,150 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామని తెలిపారు. 582 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.8.40లక్షల విలువైన మద్యం, సారాను సీజ్ చేసి, 220 మందిని బైండోవర్ చేశామని వివరించారు. జిల్లాలో మద్యం, సారాకు సంబంధించి పెద్ద మొత్తంలో ఎక్కడైనా డంప్ చేస్తున్నట్లుగానీ, చేసినట్లుగానీ సమాచారం ఉంటే వెంటనే దాడులు చేసి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.92,198 విలువైన అక్రమ మద్యాన్ని సీజ్ చేశామని చెప్పారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఒక్కో వ్యక్తికి మూడు సీసాల చొప్పున విక్రయించే వారని, ఎన్నికల నేపథ్యంలో ఒకరికి ఒక బాటిల్ మాత్రమే ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికలు ముగిసే వరకు సెబ్, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఈఎస్ జి.గంగాధర్‌రావు, ఏఈఎస్ జి.పాండు రంగారావు, సీఐ అశోక్‌కుమార్, జి.సత్యనారాయణ, జె.శ్రీనివాస్‌బాలాజీ, ముత్యాలరావు, ఎక్సైజ్ సీఐ బి.ఎస్.వి.లక్ష్మి, గుడివాడ డిపో ఐఎంఎల్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారత మహిళామండలి సభ్యులకు ఆత్మీయ సత్కారం



సత్కారం అందుకున్న భారత మహిళామండలి కార్యవర్గ సభ్యులు

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి ఆధ్వర్యంలో భారత మహిళా మండలి విజయవాడ శాఖ నూతన కార్యవర్గ సభ్యుల ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమం సోమవారం జరిగాయి. గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక ఇందుకు వేదికైంది. ముఖ్య అతిథిగా హాజరైన పారిశ్రామికవేత్త చెట్టపల్లి మారుతీప్రసన్న మాట్లాడుతూ.. మహిళా విజయాన్ని స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాహకుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. భారత మహిళామండలి విజయవాడ శాఖ కార్యవర్గ అధ్యక్షురాలు రుత్తుల శ్రీలక్ష్మీదేవి, ఉపాధ్యక్షురాలు తాడువాయి శశిరేఖ, కార్యదర్శి వడ్డాది కామేశ్వరి, కోశాధికారి కె.సచిదేవి, సహాయ కార్యదర్శి ఆర్.ఉషామాధవి, కమిటీ సభ్యులు బి.వి.ఎల్.కుమారి, పి.దివ్యవాణి, పూర్వ అధ్యక్షురాలు వి.ఉమాదేవి, సలహా కమిటీ సభ్యులు ఎ.రత్నలక్ష్మి, టి.సాయిలక్ష్మిని సత్కరించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, బి.వి.వీరభద్రరావు, పరచూరి విజయలక్ష్మి, జ్ఞాన కిషోర్ పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు గీతాలను ఆలపించారు.

మరోసారి సీఎంగా జగనన్ననే గెలవాలి

గౌడ కార్పొరేషన్ చైర్మన్ శివరామకృష్ణ



శివరామకృష్ణను సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

మోపిదేవి: కార్తికేయుని ఆశీస్సులు, దీవెనలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లవేళలా ఉండాలని గౌడ కార్పొరేషన్ చైర్మన్ ఎం.శివరామకృష్ణ కోరారు. ఆయన మరో సారి సీఎంగా గెలవాలని ఆకాంక్షించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శివరామకృష్ణ సోమవారం దర్శించుకున్నారు. అనంతరం గౌడ సంఘం నియోజకవర్గ నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా నిలిచిన జగనన్నకు బీసీలంతా ముఖ్యంగా గౌడ సంఘం పూర్తి మద్దతు పలకాలని కోరారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే పేదల బతుకులు మరింతగా మారతాయన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్ బాబును, మచిలీపట్నం ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర డైరెక్టర్ మదన్‌గౌడ్, చెన్ను రంగారావు, కోడూరు మండల పార్టీ కన్వీనర్ పరిశే మాధవరావు, జిల్లా కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, మోపి దేవి మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు, కొండేటి వాసు, ఉప్పాల కోటేశ్వరావు, కేసగాని రాంబాబు, పెద్ద ఎత్తున గౌడసంఘం నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత గౌడ సంఘం ఆధ్వర్యంలో శివరామకృష్ణకు పూల మాలలు వేసి అపూర్వ స్వాగతం పలికారు.